సాక్షి
పల్నాడు
శనివారం । 23 । ఆగస్టు । 2025



కనకదుర్గమ్మకు బోనాలు

రెంటచింతల: మండలంలోని పాలువాయి జంక్షన్ శివదుర్గ కాలనీలో కనకదుర్గ అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. భక్తులు తరలివచ్చారు.



అనాథలు, వృద్ధులకు అన్నదానం

మాచర్ల: పట్టణంలోని అనాథలు, వృద్ధులకు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. నిర్వాహకులు మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు.

బూర్గులమ్మకు ప్రత్యేక పూజలు



రేపల్లె: శ్రావణ మాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకుని గ్రామ దేవత బూర్గులమ్మ అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



అమరావతి: పవిత్ర శ్రావణ మాసంలో ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని స్థానిక అమరేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈఓ రేఖ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలోని దక్షిణాన అమ్మవారిని ప్రత్యేక వేదికపై అలంకరించి, ముత్తయిదువులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. తొలుత బాలచాముండేశ్వరీ, జ్వాలాముఖీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన చేసి లక్ష్మీదేవిని ఆవాహన చేశారు. షోడశోపచారాలతో శాస్త్రోక్తంగా పూజ నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి పిండివంటలతో కూడిన వాయినాన్ని నివేదించారు. ముత్తయిదువులు ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సపాలెంలోని మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ కోమిటినేని నాసరయ్య, రాజ్యలక్ష్మి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈవో ఎస్.మాధవీ దేవికి విరాళం చెక్‌ను దాతలు అందించారు. కార్యక్రమంలో అర్చకులు కొత్తలంక కార్తికేయ శర్మ, నందూరి కాళీకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ శుక్రవార పూజలు



నరసరావుపేట ఈస్ట్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్జీఓ కాలనీలోని అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయం, సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్ప ఆలయం, మహాలక్ష్మీ అమ్మవారు, పాలపాడు రోడ్డులోని శ్రీ చిన్న సింగరకొండ ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

రైతులకు సంతృప్తికరంగా పరిహారం చెల్లింపు



నరసరావుపేట: స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారి 167ఏ నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులతో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణంలో రైతులపై సానుకూలంగా ఉంటామని తెలిపారు. భూములు ఇచ్చిన వారికి చట్టపరిధిలో సంతృప్తికరమైన పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో ఏకా మురళి, ఆర్డీవో కె.మధులత పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,026 క్యూసెక్కులు ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12.5 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్ కాలువకు 246, బ్యాంక్ కెనాల్‌కు 1,631, తూర్పు కాలువకు 613, పశ్చిమ కాలువకు 250, నిజాపట్నం కాలువకు 407, కొమ్మూరు కాలువకు 2,640 క్యూసెక్కులు, బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 4,16,662 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

సాగులో వినూత్న ఒరవరి

- జగిత్యాల సన్న రకం వరి సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు
- గతంతో పోల్చితే పెరిగిన విస్తీర్ణం
- బీపీటీ రకంతో పోల్చితే వ్యవధి తక్కువ
- అధిక దిగుబడి ప్రత్యేకత
- పల్నాడులో 5,500 క్వింటాల విత్తనాలు అవసరం అంటున్న వ్యవసాయ శాఖ అధికారులు
- డిమాండ్ నేపథ్యంలో కృత్రిమ కొరత
- అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులు
- ఇతర రకాలను సాగు చేయాలని సూచిస్తున్న వ్యవసాయాధికారులు



జేజీఎల్-384 రకం విత్తనాలతో పోసిన వరి నారుమళ్లు

సాక్షి, నరసరావుపేట: ఈ ఏడాది జగిత్యాల సన్నాలు (జేజీఎల్-384) రకం వరి సాగు చేయడానికి పల్నాడు జిల్లా రైతులు మక్కువ చూపుతున్నారు. గతంతో పోల్చితే సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. దీంతో విత్తనాలకు గత రెండేళ్లుగా డిమాండ్ అధికంగా ఉంది. గతేడాది ఇదే సమయంలో దొరక్క పల్నాడు జిల్లా రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సాగు సమయం ఆసన్నమవడం, సాగర్‌లో పుష్కలంగా నీరు ఉండటంతో నారు పోద్దామని ఆశ పడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం నిరాశే మిగిల్చింది. విత్తనాలు దొరకలేదు. జోరు వర్షంలో సైతం క్యూలైన్లలో మహిళలు, వృద్ధులు కూడా నిలబడి మరీ అధిక ధరలకు కొనుగోలు చేశారు.

పలు మండలాల్లో రైతుల ఆసక్తి

నరసరావుపేట, రొంపిచర్ల, నకరికల్లు మండలాల రైతులు జేజీఎల్-384 వరి సాగుకు అధికంగా మొగ్గు చూపుతున్నారు. గతేడాది అధిక దిగుబడులు చూసిన రైతులు ఈ ఖరీఫ్‌లో సైతం వాటికే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు నాగార్జున సాగర్ డ్యాంలో పూర్తి స్థాయిలో నీరు ఉన్నప్పటికీ వీలైనంత త్వరగా వరి పంట పూర్తయితే కాలువ నీటితో ఇబ్బంది ఉండదన్న భావన రైతుల్లో ఉంది. దీంతో కాల వ్యవధి తక్కువున్న జేజీఎల్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇందులోని జేజీఎల్-1638 రకం కూడా కొందరు రైతులు సాగు చేస్తున్నారు.

తక్కువ వ్యవధిలో చేతికొస్తున్న పంట

- పంట కాల వ్యవధి తక్కువగా ఉండటంతో జేజీఎల్ రకానికే రైతులు ఆసక్తి చూపుతున్నారు.
- బీపీటీ-5204 రకం 145 రోజుల కాలపరిమితితో ఎకరానికి సరాసరి 35 బస్తాల దిగుబడి లభిస్తోంది.
- అదే జేజీఎల్-384 వరి రకం మాత్రం 120 నుంచి 130 రోజుల్లో చేతికొస్తుంది.
- బీపీటీతో పోల్చితే అధిక దిగుబడి లభిస్తుంది.
- చీడపీడల బెడద కూడా తక్కువగా ఉండటంతో పాటు పెట్టుబడి తగ్గుతుందన్న అభిప్రాయం రైతుల్లో నెలకొంది.
- నెల్లురు సన్నాల కన్నా ఈ రకం ధాన్యానికి అధిక ధర లభిస్తోంది.
- నిల్వకు నెల్లూరు సన్నాల కన్నా ఈ రకం అనుకూలం.



జేజీఎల్-384 రకం వరి విత్తనాల బస్తా

జిల్లాకు 5,500 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

జిల్లాలో ఖరీఫ్-2025లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 96,497 ఎకరాలుగా అధికారులు లెక్కించారు. ఇందుకు గాను సుమారు 22 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని గుర్తించి, ఏపీ సీడ్స్, ఇతర ప్రైవేట్ డీలర్ల ద్వారా అందుబాటులో ఉంచారు. ఇందులో జేజీఎల్-384 రకం వరి విత్తనాలు జిల్లాకు 5,500 క్వింటాళ్ల అవసరమవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత ఆధారంగా రైతులు గత రెండు మూడేళ్లుగా జేజీఎల్ రకం వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం విత్తనాలను సరఫరా చేయాల్సి ఉండగా ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాల రకాలను ముందుగానే గుర్తించి ఆదిశగా సరఫరా చేసేవారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో ఈ సమస్య వచ్చిందన్న వాదన రైతుల నుంచి వస్తోంది. ప్రభుత్వ నిర్లక్ష్యంలో రైతులు విత్తనాల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. డిమాండ్‌ను చూపి వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు జేజీఎల్‌కు సమానమైన ఇతర వరి రకాలను సాగు చేసి అంతే తక్కువ సమయంలో, సమాన దిగుబడి పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఎంటీయూ-1224, ఎన్ఎల్ఆర్-34449, కేఎన్ఎం-1638 రకాలను సాగు చేయాలని, ఆయా విత్తనాలు సరిపడా అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం



నరసరావుపేటలో గతేడాది విత్తనాల కోసం క్యూలైన్‌లో రైతులు (ఫైల్ ఫొటో)

చీడపీడల నుంచి రక్షణ



రైతులకు లాభదాయకంగా ఉండటంతో జేజీఎల్ 384 రకం విత్తనం సాగుకు అధికంగా మొగ్గుచూపుతున్నారు. తెగుళ్లు, చీడపీడలను తట్టుకుంటుంది. దీంతో రైతులపై పెట్టుబడి భారం తగ్గుతుంది. స్వల్పకాలిక రకం కావడంతో 125 నుంచి 130 రోజులకే పంట చేతికొస్తుంది. నీటి ఎద్దడి కొంత తగ్గుతుంది. దీంతో పాటు మార్కెట్లో మంచి ధర లభిస్తోంది.

– ఎ అప్పారావు, వరి రైతు, నకరికల్లు

ప్రభుత్వం విఫలం



ఈ ప్రాంత రైతులు అధికంగా సాగు చేసే జేజీఎల్-384 రకం విత్తనాలను రైతులకు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకే సెంటర్లలోనే రైతుల అవసరాలను తెలుసుకొని సరిపడా సరఫరా చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేల పేర్లను మార్చి నిర్వీర్యం చేసింది. దీంతో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీన్ని ఆసరా చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

– అన్నెం పున్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

అధికారుల సమీక్షలో కలెక్టర్, ఎస్పీ



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: వినాయక ఉత్సవ నిర్వాహకులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సింగల్ విండో పద్ధతిలో తప్పకుండా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినాయక చవితి పండుగ ఉత్సవాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా, భక్తిపూర్వక వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశిత నిమజ్జన ప్రదేశాల్లో ప్రణాళిక ప్రకారం విగ్రహ నిమజ్జనం జరిగేలా చూడాలని చెప్పారు. నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను, అవసరమైన చోట బోట్లను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. నిమజ్జన ప్రదేశంలో పబ్లిక్ అనౌన్స్‌మెంటు సిస్టంను ఏర్పాటు చేయాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన చోట ముందస్తు చర్యల్లో భాగంగా విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. నిమజ్జన ప్రదేశాల్లో ఉత్సవ నిర్వాహకులు కాకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన సిబ్బంది ద్వారానే చేయాలని తెలిపారు.

271 మంది దరఖాస్తు

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండపాల అనుమతుల కోసం పోలీసు శాఖ నిర్వహిస్తున్న వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 271 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో సమస్యలు లేకుండా చూడాలన్నారు. విగ్రహాల ఎత్తును బట్టి ఊరేగింపు జరిగే విధంగా వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎదురెదురుగా ఊరేగింపులు జరగకుండా చూడాలని చెప్పారు. డీజే సౌండ్ చుట్టుపక్కల వారికి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం రోజున ఆ ప్రదేశం దగ్గరలోని మద్యం షాపులు మూసి వేయనున్నట్లు చెప్పారు. నిమజ్జన ప్రదేశంలో క్రేన్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వరదలు, వర్షాల దృష్ట్యా అనువైన నిమజ్జన ప్రదేశాలను నిర్ణయించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నృసింహాలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

భక్తులతో కిటకిటలాడిన ప్రాంగణం

మంగళగిరి టౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మంగళగిరి నగరంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. మహిళలు వేకువజామునే ఇళ్లను, పూజ గదులను శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ సమక్షంలో అర్చకులు వ్రతాలను నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి తిరుమంజన సేవ జరిగింది. అనంతరం శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు.



రాజ్యలక్ష్మి అమ్మవారికి తిరుమంజన సేవ

స్వామి వారి వస్త్రాలు వేలం....

ఆలయంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. పట్టుచీరలు 43, ఫ్యాన్సీ చీరలు 387, పంచెలు 37 విక్రయించగా రూ.91,150 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

దశాబ్దంగా 'దారి'ద్ర్యం

- వర్షం వస్తే కాలువను తలపిస్తున్న మాదిపాడు రోడ్డు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సరిపెడుతున్న అధికారులు
- శాశ్వత పరిష్కారానికి నోచుకోని రోడ్డు
- వర్షం పడుతున్నప్పుడల్లా స్తంభిస్తున్న రాకపోకలు



మాదిపాడు రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

అచ్చంపేట: ఓ సమస్యతో తరచూ ఇబ్బందులకు ఎదురైతే ఎవరైనా శాశ్వత పరిష్కారం కోసం అన్వేషిస్తారు. కానీ అచ్చంపేటలోని మాదిపాడు రోడ్డు విషయంలో అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుని, అప్పటికి తమ పనైపోయిందిలే అని చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మాదిపాడు రోడ్డు టర్నింగ్‌లో పాత సినిమా హాలు సెంటర్ నుంచి సీతారామస్వామి రైస్ మిల్ వరకు నడుం లోతులో నీళ్లు ప్రవహించాయి. ఆర్టీసీ బస్సులు ఆగిపోయాయి. ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

పలు గ్రామాలకు ప్రధాన రహదారి

జిల్లాలో చిట్టచివరి గ్రామమైన మాదిపాడుకు వెళ్లేందుకు ప్రధాన రహదారి ఇదే. పులిచింతల ప్రాజెక్టుతో పాటు కృష్ణానదికి అవతలి వైపునున్న ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామాలకు నదిపై నడిచే పడవలు, బల్లకట్టులకు ప్రజలు వెళ్లేందుకు ఇదే రహదారి. పవిత్ర పుణ్యక్షేత్రాలైన ముక్త్యాల, పెనుగంచిప్రోలు, వేదాద్రి, కోటిలింగాల మహాక్షేత్రం, కోర్కెలు తర్చే తల్లిగా భక్తులు విశ్వశించే సత్తెమ్మతల్లి వద్దకు చేరుకోవాలన్నా ఈ మార్గమే శరణ్యం. నిత్యం అచ్చంపేటకు మాదిపాడు, చల్లగరిక, తాడువాయి చింతపల్లి, పుట్లగూడెం, చెరుకుంపాలెం, కొత్తపల్లి, తాళ్లచెరువు తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు, రైతులు, డ్వాక్రా మహిళలు అచ్చంపేటకు వస్తుంటారు. ఇంత ప్రాధాన్యం గల రోడ్డులో వర్షం పడినప్పుడల్లా నీళ్లు నిలబడి రోజుల తరబడి రాకపోకలకు అంతరాయం కలుగుతున్నా శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ సమస్య ఈనాటిది కాదు. పదేళ్లుగా ఎవరూ పట్టించుకోవడం లేదు.

అర కిలోమీటరు మేర రోడ్డు పల్లం

పాత సినిమా హాలు సెంటర్‌లో సుమారు అర కిలోమీటరు మేర రోడ్డు పల్లంలో ఉంది. ఒక మోస్తరు వర్షం పడితే చాలు, నీళ్లు పోయే మార్గంలేక రోడ్డుపై నడుం లోతు నిలుస్తాయి. రోడ్డుకు పక్కనే 33/11కేవి విద్యుత్ సబ్ స్టేషన్ ఉంది. ఈ నీళ్లు మొత్తం అందులోకి చేరడంతో సరఫరా నిలిపివేస్తున్నారు. ఇక విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించడానికి , సిబ్బంది ఆఫీసుకు నీళ్లలో నుంచి నడుచుకుంటూ వెళ్లాలి.

అధికారుల నిర్లక్ష్యం

వర్షం పడ్డప్పుడలా అరకిలోమీటరు మేర రోడ్డు వాగును తలపిస్తుంది. పక్కన ఆక్రమణలు మెరక్కై, రోడ్డు పల్లమైంది. సైడు కాలువలు మొత్తం పూడిపోయాయి. వర్షం నీళ్లు వెళ్లాలంటే పొలాల్లోంచి కాలువలు తీసి, కిలోమీటరు దూరంలో ఉన్న కృష్ణానదిలో కలపాలి. లేనిపక్షంలో దిగువన తూర్పు వైపున రాజీవ్‌నగర్ కాలనీ పక్కగా సైడు కాలువలు తీసి చిగురుపాడు వాగులోనైనా కలపవచ్చు. అధికారులు, పాలకులు పట్టించుకుంటే ఇదేమంత పెద్ద విషయం కాదు.

గుంటూరు చానల్‌కు మరమ్మతులు

- కృష్ణా నది నుంచి నీటి సరఫరాను నిలిపివేసిన యంత్రాంగం
- తాగునీటి కోసం ప్రత్యామ్నాయాలపై స్థానిక అధికారుల దృష్టి



గుంటూరు చానల్‌లో తగ్గిపోయిన నీటి ప్రవాహం

మంగళగిరి: గుంటూరు చానల్‌కు కాజ వద్ద జరుగుతున్న మరమ్మతుల కారణంగా కృష్ణా నది నుంచి నీటిని ఆపారు. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజారోగ్య శాఖ జేఈ ప్రసన్న తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థకు తాగునీరు సరఫరా చేసే మంగళగిరి మండలంలోని ఆత్మకూరు వద్ద కల గుంటూరు చానల్‌ను, తాగునీటి పథకాన్ని జేఈ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు చానల్ మరమ్మతుల కారణంగా మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థతో పాటు గుంటూరు నగరం, మరికొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వెల్‌లోని నీటిని వాడుకోవడంతోపాటు సీతానగరం నుంచి గుంటూరు వెళ్లే పైపులైన్ల నుంచి ఎంటీఎంసీకి నీటిని తీసుకుని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గుంటూరు చానల్‌కు మరమ్మతులు దాదాపు పూర్తి కావచ్చినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారని వివరించారు. ఆ పనులు పూర్తయిన వెంటనే చానల్‌కు నీరు సరఫరా అవుతుందని తెలిపారు.

ఐదు మండలాలకు ఇదే కీలకం

గుంటూరు, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు ఐదు మండలాలకు సాగు, తాగునీటిని గుంటూరు చానల్ ద్వారా అందిస్తున్నారు. కృష్ణా నది వద్ద ప్రకాశం బ్యారేజీ నుంచి 47 కిలోమీటర్ల పొడవున ప్రవహించి సాగు, తాగునీటి అవసరాలను ఈ చానల్ తీరుస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, పెదకాకాని, గుంటూరు కార్పొరేషన్, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల ప్రజలు తద్వారా లబ్ధి పొందుతున్నారు. మొత్తం 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా.. వరి, మిరప, పత్తి, అపరాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి 4 టీఎంసీలు సరఫరా అవుతుండగా.. 3.2 టీఎంసీలు సాగుకు, 1.42 టీఎంసీలను తాగునీటికి వినియోగిస్తున్నారు. ఐదు మండలాల్లోని గ్రామాలలోని ట్యాంకులకు ఈ తాగునీరు అందుతోంది. ఇటీవల వర్షాలకుతోడు కొండవీటివాగు వరదను ఈ చానల్‌లోకి మళ్లించడంతో గండ్లు పడి వేలాది ఎకరాలోపంట నీటమునిగింది. మరోవైపు గుంటూరు చానల్‌పై కాజ – నంబూరు మధ్య వంతెన సహా పలు చోట్ల ఉన్నవి శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికే అంతంత మాత్రంగా సరఫరా అవుతున్న నీరు ఈ వంతెన వద్ద ఏ చిన్న ఘటన జరిగినా పెద్దసంఖ్యలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,000** గరిష్టం : రూ. **2,400**

మోడల్ ధర రూ. **2,800**

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,538
అమ్మకాలు	49,099
నిల్వ	7,830

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-13,500
నంబరు-5	10,000-13,200
273	10,000-13,000
341	10,000-14,600

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,800
నంబరు-5	10,000-13,500
341	11,000-15,000
4884	10,000-13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,500
బాడిగ-355	10,000 - 14,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,500
ఆర్మూర్	9,800 - 11,500
తాలుకాయలు	6,000 - 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-14,500
బాడిగ - 355	10,000-13,500
దేవనూరు డీలక్స్	10,500-13,600
తాలు	5,300 - 7,200

-కొరిటెపాడు (గుంటూరు)

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు

నెహ్రూనగర్: దివ్యాంగ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్కాలర్‌షిప్ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తుందని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గాబాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోపు httpr://rchoarrhipr.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

ప్రభుత్వ తీరును దుయ్యబట్టిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ నాయకులు



సమావేశంలో ఆకాష్, విజయ్‌రెడ్డి, వేణు, కల్యాణ్ తదితరులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వ పెద్దలు మెగా డీఎస్సీని దగా డీఎస్సీగా మిగిల్చారని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగ నాయకులు పేర్కొన్నారు. లింగంగుంట్ల కాలనీలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్ మాట్లాడారు. డీఎస్సీని నిర్వహించడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందని తెలిపారు. డీఎస్సీ పరీక్షల ఫలితాలు ఇంటర్నెట్‌లో పెట్టకుండా నియామకాలు చేసేందుకు పూనుకున్నారని వెల్లడించారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 3లక్షల మందికి ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు కల్పించగా, కూటమి ప్రభుత్వం వారందరి ఉద్యోగాలు ఊడ బెరికిందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగ నియోజకవర్గ అధ్యక్షులు విజయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పుతల వేణు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, మణికంఠారెడ్డి, షేక్ నాగూర్, హరి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణ వేగవంతం చేయాలి

జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల

నరసరావుపేట: యువత హెచ్‌ఐవీకి గురికాకుండా ఈ నెలంతా గ్రామాలు, పట్టణాలలో ప్రత్యేక కార్యక్రమాల ద్వారా సుఖవ్యాధులు, హెచ్‌ఐవీ గురించి కరపత్రాలు, పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించాలని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల తెలిపారు. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్‌లో భాగంగా ఏపీ శాక్స్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ నివారణ, సుఖవ్యాధుల చికిత్సపై ఐసీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ సెంటర్లు, స్వచ్ఛంద సంస్థలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత నెలలో చేసిన కార్యక్రమాలపై జూమ్ మీటింగ్ ద్వారా డాక్టర్ మంజుల సమీక్ష చేశారు. హెచ్‌ఐవీతో జీవించే వారికి మెరుగైన సేవలు అందించాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఏఆర్‌టీ సెంటర్లలో మందులు వాడే వారు ప్రతిరోజు సరైన సమయానికి తీసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. మందులు మిస్ అయిన వారికి కౌన్సెలింగ్ చేసి, తిరిగి వాడేలా చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వాడటం వల్ల వైరల్ లోడ్ పూర్తిగా అదుపులో ఉంటుందని తెలిపారు. వైరల్ లోడ్ పరీక్షలో 200 కన్నా తక్కువ కాపీలు వస్తే వారిద్వారా ఇతరులకు హెచ్‌ఐవీ వ్యాపించదని డాక్టర్ మురళీకృష్ణ వెల్లడించారు. సుఖవ్యాధులను గుర్తించి భాగస్వామి సహా పూర్తికాలం మందులు వాడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీబాషా మాట్లాడుతూ గర్భిణులకు తప్పనిసరిగా సకాలంలో హెచ్‌ఐవీ పరీక్షలు చేయాలని చెప్పారు. పాజిటివ్ వచ్చిన వారికి వెంటనే మందులు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. 32 నుంచి 36 వారాల మధ్య తప్పనిసరిగా వైరల్‌లోడ్ పరీక్ష సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. టార్గెట్ ఇంటర్ వెన్షన్ కార్యక్రమం ద్వారా హైరిస్క్ గ్రూపుల వారు మందులు మిస్ అవ్వకుండా కౌన్సెలింగ్ చేయాలని తెలిపారు. హెపటైటిస్ బీ టీకా కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని, హెచ్‌ఐవీ నివారణా కార్యక్రమాలు యువతకు చేరువ అయ్యేలా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సాంకేతిక నిపుణులు శశిధర్ రెడ్డి, రీడ్స్, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్, క్యాంప్ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, సీటీసీ కేంద్రాలు, ఏఆర్‌టీ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మూల్యాంకన విధానం మార్చు చేయాలి

ఏపీటీఎఫ్ డిమాండ్



డీఈఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాలల్లో పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకాల విధానంలో మార్పులు తీసుకురావాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మూల్యాంకన విధానం పాఠశాలల్లో బోధనా సమయాన్ని హరించే విధంగా ఉందని తెలిపారు. గతంలో పరీక్షలను పేపర్లపై నిర్వహించి ఇంటికి తీసుకువెళ్లి మూల్యాంకనం చేసేవారమని, ప్రస్తుతం పుస్తకాలను ప్రవేశపెట్టడం వల్ల వాటిని పాఠశాలలోనే చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. దీనికితోడు మార్కుల ఆన్‌లైన్, రిజిస్టర్‌లో నమోదు, బబ్లింగ్ వంటి అదనపు పని భారంతో బోధనాభ్యాసాలకు సమయం లేకుండా పోతున్నదని పేర్కొన్నారు. కొత్త విధానం వల్ల సత్ఫలితాలు రాకపోగా, నష్టదాయకమని వివరించారు. మార్కులు ఆన్‌లైన్ నమోదుకు పరిమితం చేసి, మిగిలిన వాటి నుంచి వెసులుబాటు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.ఉస్మాన్, ప్రధాన కార్యదర్శి వి.వి.రవికుమార్, ఉపాధ్యక్షుడు ప్రజామూర్తి, బాళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల కింద చవితి పందిళ్లు వద్దు

సూచించిన విద్యుత్‌శాఖ అధికారులు

నరసరావుపేట: చవితి పందిళ్లను విద్యుత్ లైన్ల కింద ఏర్పాటు చేయరాదని జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి.విజయకుమార్ సూచించారు. పందిళ్లకు కావాల్సిన విద్యుత్ కోసం ముందుగానే కమిటీ వ్యక్తులు దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని ఆయన సూచించారు. విద్యుత్ వైర్లను జాగ్రత్తగా పరిశీలించి నిమజ్జన ఊరేగింపులను జరపాలని తెలిపారు. ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ లేదా సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. విద్యుత్‌ను అక్రమంగా వాడుకోరాదని, దీనికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనివల్ల కొన్ని సమయాల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని, ఉత్సవాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఏపీ ఓపెన్ స్కూల్ (దూరవిద్య) 10వ తరగతి, ఇంటర్మీడియేట్ కోర్సుల్లో చేరేందుకు రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లా పరిధిలోని దూరవిద్య కేంద్రాల నిర్వాహకులతో శుక్రవారం శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆసక్తి గల అభ్యర్థులు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో సమర్పించి, తరువాత ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని ఆమె సూచించారు. 10వ తరగతిలో ప్రవేశం పొందేందుకు 14 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, రికార్డ్ షీట్, టీసీతో పాటు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని తెలిపారు. ఒకవేళ ఎటువంటి విద్యార్హత లేకున్నా జనన ధ్రువీకరణ పత్రంతో పాటు స్వీయ ధ్రువీకరణతో నేరుగా చేరవచ్చని వివరించారు. ఇంటర్మీడియేట్‌లో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్‌తో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు. కాగా, పీసీపీ తరగతులను ఆయా కేంద్రాల నిర్వాహకులు ఈనెల 24, 31 తేదీల్లో విధిగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు. అధ్యాపకులను నియామకం చేసి తరగతుల నిర్వహణ ఫొటో, అభ్యాసకుల హాజరును జిల్లా సార్వత్రిక విద్యాపీఠం కార్యాలయంలో సమర్పించాలని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో దూరవిద్య జిల్లా కోఆర్డినేటర్ కేఎంఏ హుస్సేన్ పాల్గొన్నారు.

సహకార సంఘాలతో బహుళ ప్రయోజనాలు

జీడీసీసీబీ చైర్మన్ మక్కెన

రొంపిచర్ల: రానున్న రోజుల్లో సహకార సంఘాల ద్వారానే ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరతాయని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. నరసరావుపేట జీడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పీఏసీఎస్ చైర్‌పర్సన్‌ల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సహకార సంఘాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కోఆపరేటివ్ యూనియన్ డిప్యూటీ రిజిస్ట్రార్ యు. నాగశ్రీనివాసరావు మాట్లాడుతూ నూతనంగా నియమింపబడ్డ చైర్‌పర్సన్‌లకు ఒకరోజు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లా సహకార శాఖ అధికారి ఎం. నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని 59 సొసైటీలలో కంప్యూటరైజేషన్ పూర్తయ్యిందని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌సీవో కె. తిరుపతయ్య, జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ రమాదేవి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డి, షేక్ రహంతుల్లా, కార్తిక్, పి. వెంకటేశ్వర్లు, డి. శ్రీనివాసరావు, కంటు శ్రీనివాసరావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

యువతులపై గంజాయి మూక దాడి

- టీడీపీ నేత అండతో హత్యా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితుల ఆందోళన
- గంజాయి తాగేందుకు డబ్బు ఇవ్వలేదని తన తండ్రిపై దాడి చేశారంటూ కుమార్తె ఫిర్యాదు
- పోలీసులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపణ
- తమకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని ఆశ్రయించిన బాధితులు



జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మహిళలపై జరుగుతున్న దారుణాలకు అంతే లేకుండా పోయింది. అదేమంటే గంజాయి, మద్యం తాగొచ్చి 'చంపేస్తాం' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికారం తమది అంటూ రెచ్చిపోతున్నారు. ఇదే తరహా సంఘటన శుక్రవారం రూరల్ మండలంలోని దాసరిపాలెం గ్రామంలో వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... దాసరిపాలేనికి చెందిన కొరబడి మరియదాసు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు కుమార్తె ఉంది. ఆమె గుంటూరులో ఒక దుకాణంలో కూలీ పనులు చేస్తోంది. ఈ క్రమంలో రెండు రోజుల కిందట మరియదాసు ఇంటి నుంచి రోడ్డుకు వచ్చాడు. అదే సమయంలో నాని, చిన్న, కార్తిక్, ఆనంద్, మరికొందరు మరియదాసును మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని అడిగారు. లేవని చెప్పడంతో అప్పటికే గంజాయి మత్తులో ఉన్న రౌడీమూక దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. మరియదాసు కుమార్తె, సోదరి దీనిపై ఆ మూకను నిలదీశారు. దీంతో వారిపైనా దాడి చేసి, నోటికి వచ్చినట్లు దుర్భాషలాడారు. ఇంకోసారి కనిపిస్తే చంపేస్తామని బెదిరించారని బాధితులు ఆరోపించారు. మరియదాసును చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అనంతరం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాసరిపాలేనికి చెందిన సుధీర్ అనే టీడీపీ నాయకుడు జోక్యం చేసుకుని, నిందితులు తమ పార్టీకి చెందిన వారేనని పోలీసులకు చెప్పారని బాధితులు తెలిపారు. దీంతో పోలీసులు సైతం తమనే తిట్టి వెనక్కి పంపారని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే మనిషి సుధీర్ కావడంతో అతడు ఏది చెబితే అదే చేస్తామని పోలీసులు అంటున్నారని ఆరోపించారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని, తమను గంజాయి బ్యాచ్ నుంచి కాపాడాలని బాధితులు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు.

రీసర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రీ సర్వే పనులను అధికారులు నిరంతరం సమీక్షించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన వీడియో సమావేశంలో మాట్లాడుతూ.. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పెద్ద గ్రామాలు, మండల హెడ్‌క్వార్టర్స్‌లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. సర్వే జరగని గ్రామాల్లో సిబ్బందిని ఎక్కువ పీపీఎంలో ఉన్న గ్రామాలకు కేటాయించి, అదనపు టీమ్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి టీమ్‌కు కనీసం 50 ప్రాపర్టీ పార్శిల్ మ్యాప్‌లను గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేసేలా చూసుకోవాలని చెప్పారు. అదేరోజు ప్యూజీ ఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేయడం తప్పనిసరి అన్నారు. ఇంజినీరింగ్, డిజిటల్ సహాయకులకు సర్వేయర్ ద్వారా ప్యూజీ ఐఎస్‌పై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవోలు మండల స్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో సర్వే శాఖ ఏడీ పవన్‌కుమార్, డీఆర్వో ఖాజావలి పాల్గొన్నారు.

26న ఎన్‌ఏసీ కేంద్రంలో జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌ఏసీ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు, ఎన్‌ఏసీ ఏడీ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు దాదాపు 10 కంపెనీలు హాజరై, అర్హులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయని పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి పీజీ, డిప్లొమా, బీటెక్, ఫార్మసీ అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9160200652, 7702921219 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కదులుతున్న రైలుపైకి భార్యను నెట్టిన భర్త

- స్పృహ తప్పిన బాధితురాలు
- ఆసుపత్రికి తరలించిన స్థానికులు



వెంకటేశ్వరరావు



గాయాలతో స్పృహతప్పి పడిపోయిన అంజలి

తాడేపల్లి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను రన్నింగ్‌లో ఉన్న ట్రైన్‌పైకి తోసివేసిన ఘటన శుక్రవారం తాడేపల్లి గేటు సెంటర్‌లో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... నూజివీడుకు చెందిన వెంకటేశ్వరరావు, అతని భార్య అంజలి కొంతకాలంగా తాడేపల్లిలో నివసిస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం విడాకులు కూడా తీసుకుని వేరువేరుగా ఉంటున్నారు. ఇటీవల కలసి జీవనం కొనసాగిస్తున్నారు. అంజలి తాడేపల్లి సలాం సెంటర్ నుంచి శుక్రవారం ఉదయం బైపాస్‌రోడ్‌లో ఉన్న ఓ హోటల్‌లో పని చేసేందుకు వెళుతోంది. గేటు సమీపంలో భర్త వెంకటేశ్వరరావు తారస పడ్డాడు. అదే సమయంలో రైలు వెళుతుండగా భర్త ఆమె జుట్టు పట్టుకుని వేగంగా వెళుతున్న రైలు మీదకు నెట్టాడు. రైలు ఢీకొనడంతో అంజలి తీవ్ర గాయాలతో అక్కడే కుప్పకూలిపోయింది. స్థానికులు 108కు ఫోన్ చేసి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పారిపోతున్న వెంకటేశ్వరరావును పట్టుకుని తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంధుల క్రికెట్ టోర్నీ విజేత 'ఆంధ్రా గ్రీన్'



విజేతగా నిలిచిన ఆంధ్రా గ్రీన్ జట్టు సభ్యులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ రాష్ట్ర అంధుల క్రికెట్ జట్టు కోసం గత మూడు రోజులుగా స్థానిక అరండల్‌పేటలోని ఏసీఏ క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఏపీ, విజువల్లీ బ్లైండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, డిఫరెంట్ డిసేబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంయుక్తాధ్వర్యంలో జరిగిన పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేత జట్టుగా ఆంధ్రా గ్రీన్స్ జట్టు నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన 42 మందిని ఎంపిక చేసి ఆంధ్రా బ్లూ, ఆంధ్రా ఎల్లో, ఆంధ్రా గ్రీన్ పేరుతో పోటీలను నిర్వహించారు. ఆంధ్రా గ్రీన్ విజేతగా నిలిచింది. వీసీఈఏ అధ్యక్షుడు జి.రవీంద్ర బాబు ముఖ్యఅతిథిగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో క్రికెట్‌కు అండగా నిలుస్తున్న రామకృష్ణ పరమహంస, మోటివేషనల్ స్పీకర్ శ్రీధర్‌బాబు, మాజీ బ్లైండ్ క్రికెటర్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి విజేతలకు ట్రోఫీని అందించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రికెటర్లను ప్రోత్సహించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారిని జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున పంపిస్తామని తెలిపారు. పోటీల ప్రారంభోత్సవానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కొలగాని శ్రీనివాసరావు, ఎల్వీఆర్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగదు కోసం యాచకుడి హత్య

నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: నగదు కోసం యాచకుడైన వృద్ధుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సీఐ ఎస్. రమేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యాచకుడు వెంకటనారాయణ(70) జూన్ 8న రాత్రివేళ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం హత్యకు గురైనట్లు నిర్ధారించి, కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా దర్యాప్తు చేపట్టారు. అవనిగడ్డ మండలం లంకమాన్యం ప్రాంతానికి చెందిన నిందితుడు కొల్లి రాజేష్‌ను అరెస్టు చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని సాయిబాబా గుడి వెనుక ఓ టింబర్ డిపో వద్ద నిద్రించిన వృద్ధుడి వద్ద రూ.3 వేల నగదు ఉంది. ఈ విషయం గమనించిన రాజేష్ అతడిపై దాడి చేసి హతమార్చి నగదుతో పారిపోయాడు. దీంతో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. సమావేశంలో ఎస్‌ఐలు ప్రకాశరావు, కరిముల్లా, కానిస్టేబుళ్లు మురళి, జయకర్ బాబు, సురేష్ పాల్గొన్నారు.

కేఎల్‌యూ డైరెక్టర్‌కు జాతీయ పురస్కారం



జాతీయ పురస్కారం అందుకుంటున్న డైరెక్టర్ సాయి విజయ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) డైరెక్టర్ పిసిని సాయి విజయ్ శుక్రవారం జాతీయ పురస్కారం అందుకున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ తెలిపారు. హైదరాబాద్‌లోని నియో కన్వెన్షన్‌లో ఈకే ఉపదేశ మీడియా ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డ్స్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ అవార్డు సాయి విజయ్‌కు లభించిందని పేర్కొన్నారు. ఈ అవార్డు కోసం దేశవ్యాప్తంగా అనేక నామినేషన్లు అందినప్పటికీ సాయి విజయ్ ఎంపిక కావడం అభినందనీయమని తెలిపారు. ఆయన్ను వర్సిటీ ప్రో వీసీలు డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్ అభినందించారు.